మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## సమస్యలు ఉంటే ..

# నన్ను కలవండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- క్యాంపు కార్యాలయానికి రండి సమస్యలు ఉంటే అక్కడే కలిసి చర్చిద్దాం.. పరిష్కరిద్దాం..
- ప్రజల అభివృద్ధే లక్ష్యం
- మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయం
- విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై నియోజకవర్గ స్థాయి సమావేశం



మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 2 ప్రభాతవార్త :** సమస్యలుంటే క్యాంపు కార్యాలయానికి రావాలని, అక్కడే కలిసి చర్చించి పరిష్కారం కనుగొందామని, ప్రజల అభివృద్ధే లక్ష్యమని వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి వెలుగు వస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక " 99 రోజుల కార్యక్రమం లో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు దగ్గరగా పరిపాలన అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనతో ఈ 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజల్లో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించాలన్నలక్ష్యంతో ఈకార్యక్రమం కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ, మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించగా, ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల ప్రజాపాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధిపనులను ప్రజలకు వివరించారు, ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈసమావేశానికి అధిక సంఖ్యలో మహిళలు రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల వారి భద్రత, స్వావలంబన పెరిగిందని, చిన్నచిన్న వ్యాపారులు చేసుకొనే మహిళలు కూడా ఈ సౌకర్యంతో తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు. గత 2 సంవత్సరాల 4 నెలల్లో సుమారు రూ.10,000 కోట్లు మహిళలకు ఆదా అయ్యిందని, మొత్తం 5సంవత్సరాల్లో ఇది రూ. 25,000 కోట్లకు చేరుతుందని అంచనాగా చెప్పారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా రాష్ట్రంలోని 95కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, ప్రతి కుటుంబానికి నెలకు రూ.1000 నుండి రూ.1400 వరకు ఆదా అవుతోందని తెలిపారు. రైతులకు భారీ రుణమాఫీ అమలు చేశామని, మహబూబ్‌నగర్‌లో 11,000 మంది రైతులకు రూ.82కోట్లరుణమాఫీ కల్పించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20,000 కోట్లతో 25లక్షల కుటుంబాలకు రుణవిముక్తి కల్పించినట్లు పేర్కొన్నారు.

జూన్ 2నుండి రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ జీవిత బీమా " పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించనున్నట్లు, ఈ పథకం ద్వారా 1.15 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు" పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలు అందించి, వారు స్వయంగా ఇళ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మహబూబ్‌నగర్‌లో ఇప్పటికే 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు, రేషన్ షాపుల్లో నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఇల్లు, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. శతశాతం " కార్యక్రమం ద్వారా సుమారు 40 పాఠశాలలో వాలంటీర్లను నియమించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. దీని ఫలితంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పదవ తరగతి ఫలితాల్లో 90 పాస్ రేటు సాధించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మహబూబ్‌నగర్‌లో మన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 10 మంది విద్యార్థులలోపలే ఐఐటీ కళాశాల లో చేరారు అని, ఈ సంవత్సరం కనీసం 60 మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారిని ఆర్థికంగా బలంగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని, ప్రజల సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజకీయాలకతీతంగా అందరూ కలిసి పనిచేస్తేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్" పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### హాజరుకానున్న 4,214 మంది అభ్యర్థులు

### 372 మంది ఇన్విజిలేటర్లు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 2,ప్రభాతవార్త :** జిల్లాలో మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న జాతీయ స్థాయి మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్‌ను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్లో శనివారం పరీక్షా కేంద్రాల చీఫ్‌సూపరింటెండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో ఉన్న 12నీట్ పరీక్షా కేంద్రాలలో అధికారులు పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లును పూర్తిచేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సి.సిటీవీ కెమెరాలు, జ్యామర్లు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థలను ఏర్పాటుచేసి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేవా నిర్ధారించుకోవాలని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అభ్యర్థుల తనిఖీ (ఫ్రిస్కింగ్) కోసం అవసరమైన బ్యాక్ అప్ ఏర్పాట్లును కూడా చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా బయోమెట్రిక్ అటెండెన్స్‌ను అన్ని కేంద్రాల్లో ఉదయం 9.30 గంటలలోపు సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారికి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆర్.టీ.సి అధికారులు ఉదయం 9 గంటల నుండి అధిక సంఖ్యలో బస్సులను నడిపేటట్టు చూడాలని తెలిపారు. పోలీసు శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి, ప్రవేశం లేని వ్యక్తులను లోపలికి అనుమతించవద్దని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న నీట్‌పరీక్షకు మొత్తం 4,214మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరిలో 25మంది దివ్యాంగ అభ్యర్థులు ఉండగా, వారికి అదనంగా ఒక గంట సమయం ఇచ్చి సాయంత్రం 6.00గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు 372 మంది ఇన్విజిలేటర్లును, 13 మంది పరిశీలకులు నియమించినట్టు తెలిపారు. అదనంగా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నుంచి స్వతంత్ర పరిశీలకులు కూడా పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారు. అభ్యర్థులకు సూచనలుఅభ్యర్థులకు ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల లోపు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తారు. 1.30 గంటల తర్వాత గేట్లు మూసివేయబడతాయి. పరీక్ష మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు, కాలిక్యులేటర్లు, ఆభరణాలు, పౌచులు, పెన్సిల్లు, పెన్నులు, అనుమతి –మిగతా4లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డికే అరుణ

## నరేంద్ర మోదీ జనాగ్రహ సభను

# విజయవంతం చేయండి

### డబల్ ఇంజన్ సర్కారు వస్తేనే తెలంగాణ అభివృద్ధి

### అబద్ధపు హామీలతో ప్రజలు నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం : ఎంపీ డీకే అరుణమ్మ

**గద్వాల మే 02, ప్రభాతవార్త:**ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ ఖిజనాగ్రహా సభఖిను జయప్రదం చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మ పిలుపునిచ్చారు. శనివారం గద్వాలలో పట్టణంలోని డికె.బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డికె. అరుణమ్మ మాట్లాడుతూ... మూడవ సారి ప్రధాని బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిారి తెలంగాణకి వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీశంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకే ఖిజనాగ్రహా సభఖి నిర్వహిస్తున్నామని, ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తుందని, దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలోనూ పార్టీ బలపడుతోందని, అస్సాం, పుదుచ్చేరిలో సానుకూల వాతావరణం ఉందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుంది కాబట్టే. పదేపదే ప్రజలు అధికారం కట్టబెడుతున్నారు. పదేళ్ల పాలించిన బియర్ ఎస్ ప్రజలను మోసం చేసి ఆశలు అడియాశలు చేసి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. బియర్ ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలను నమ్మి మోసపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. తెలంగాణలో 7,823 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు , జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ,మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు ,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బొటే, అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థులు బలిగేరా శివా రెడ్డి ,రాజగోపాల్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దాస్ తదితరులు హాజరయ్యారు.

# జిల్లాలో దారుణ హత్య..

### భూతగాదాలతో ప్రాణాలు కోల్పోయిన రైతు!..

### దౌర్జన్యంగా పొలం అక్రమించుకున్నాడని అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకుని వైనం..

### నిందితుల్లో ఒకరు పోలీసుల ముంగట లొంగిపోయినట్లు సమాచారం



హత్యకు గురైన చంద్రు నాయక్

**మల్దకల్ మే 02, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని మద్దెలబండ తండాలో భూ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురికావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మద్దెల బండతండాకు చెందిన చంద్రునాయక్ (40)కు చెందిన భూమిని, దాయా దులైన బోడియ రాములునాయక్ కుటుంబసభ్యులు మిగతా4లో.

# సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివి

### ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా చేర్యలు

### నియోజకవర్గంలో 35 వేల కొత్త రేషన్ కార్డులను అందించాం : రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి



మాట్లాడుతున్న చిన్నారెడ్డి ,



చెక్కులు అందజేస్తున్న చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి,డిసిసి అధ్యక్షులు శివ సేన రెడ్డి

**వనపర్తి ప్రతినిధి ,మే 2 ప్రభాతవార్త :** ప్రజా ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివి, రెండింటిని సమానంగా ముందుకు తీసుకుపోవడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జెడ్పి సీఈవో యాదయ్య, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. కార్యక్రమానికి ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందుతున్నాయని ఆయన తెలిపారు. ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే మనం గ్రామస్థాయి మండల స్థాయి సభలను నిర్వహించుకున్నామని, ప్రస్తుతం నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని త్వరలోనే జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి కార్యక్రమాలను కూడా జూన్ రెండవ తేదీన విజయవంతంగా నిర్వహించుకుందామని తెలిపారు. ఈ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇప్పటికే పరిసరాల పరిశుభ్రత, ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్, ఆరోగ్య వారోత్సవాలు వంటి అంశాలను పూర్తి చేసుకుని ప్రజల లోపల ఆరోగ్యంపై, రహదారి భద్రతపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వానికి సంక్షేమము అభివృద్ధి రెండు కళ్ళ లాంటివని రెండింటిని సమానంగా ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో బాగా పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాధికారులకు సిబ్బందికి ప్రతి నెల ఒకటో తారీకు నుంచి జీతాలు చెల్లిస్తుందని తెలియజేశారు. పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సంతకం మహిళా శక్తి పథకంపై చేశారని తెలిపారు. తద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయలు మహిళా శక్తి పథకం కోసం మహిళల ప్రయాణం కోసం ఖర్చుపెట్టిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును గృహ జ్యోతి పథకం కింద ప్రభుత్వం పేదలకు అందించి పేదలకు కరెంటు కష్టాలు తీర్చిందని తెలిపారు. అదే విధంగా గత పది సంవత్సరాలలో ఎన్నడూ ఒక రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, రేవంతన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వనపర్తి నియోజకవర్గం లో 35 వేల కొత్త రేషన్ కార్డులను అందించామని తెలిపారు. తద్వారా రైతుభరోసా పెట్టుబడి సాయం కింద గతంలో ఎకరాకు పదివేలరూపాయలు ఇస్తే, ఇప్పుడు దాన్ని ఎకరాకు రూ.1 వేలకు పెంచామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు బాధ్యతలు మహిళల కు అప్పజెప్పడం జరిగిందన్నారు. ప్రతినియోజకవర్గంలో –మిగతా4లో..

# ఇది ఫామ్ హౌస్ ప్రభుత్వం కాదు.. ప్రజా ప్రభుత్వం..

### పదేళ్ల కెసిఆర్ పాలనలో ఇండ్లు, రేషన్ కార్డులు, ఇవ్వలే

### త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న జిఎంఆర్

**దేవరకద్ర,మే2 ప్రభాతవార్త:**గత పదేళ్ల కెసిఆర్ పాలనలో ప్రజలకు అందని పాలన ఉండేదని, ఇప్పుడు మా ప్రజాప్రభుత్వంలో ప్రజల మధ్య కెళ్ళి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని, ఇది ఫామ్ హౌస్ ప్రభుత్వం కాదు, ప్రజాప్రభుత్వం అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులను ఇచ్చామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అర్హులందరికీ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజలతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని, ప్రతి కుటుంబం సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి కుటుంబం ఈ అవకాశాలను ఉపయోగించుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విద్య వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు, మిత్తిలు కట్టుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 10లక్షల ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్ల తోపాటు రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు రేషన్‌కార్డులు ఇస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని తెలియజేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాదికి 13 వేల కోట్లు వేచించి, రేషన్ షాప్ ల ద్వారా తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తున్నామని, దేశంలో ఎక్కడా కూడా బిజెపి పాలిత రాష్ట్రాలలో సన్న బియ్యం ఇవ్వట్లేదని తెలియజేశారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయని అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని, ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇండ్లు మంజూరు చేశామని, అందులో సుమారు 2300 ఇండ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతా బేస్మెంట్ దశలో ఉన్నాయని అన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు విభిన్న పథకాలకు శ్రీకారం చుట్టి ముందుకెళ్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి అన్నారు. అనంతరం అడ్డాకుల, మూసాపేట్, భూత్పూర్, మండలాలకు చెందిన అంగన్వాడి వర్కర్స్ కు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అడిషనల్ కలెక్టర్ రామ్ రెడ్డి, దేవరకద్ర ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, కౌకుంట్ల ఎంపీడీవో శివప్రసాద్, కౌకుంట్ల తాహసిల్దార్ సుందర్ రాజ్, దేవరకద్ర తాహసిల్దార్ మమ్మద్ హర్షద్, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, గుడిబండ అమరేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా మహిళశక్తి క్యాంటిన్‌ను సందర్శిస్తున్న కలెక్టర్

# ఇందిరమ్మ క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

### నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

### మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఇందిరా మహిళా శక్తి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్,మే 2 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి ఇందిరమ్మ క్యాంటీన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాంటీన్ పనితీరును ప్రత్యక్షంగా సమీక్షించారు. సందర్శన సందర్భంగా క్యాంటీన్‌లో వంటకాలు తయారు చేసే విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడి, ప్రతిరోజూ భోజనం సమయానికి అందుతున్నదా, సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అదేవిధంగా కలెక్టరేట్‌కు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో మాట్లాడి, భోజనం రుచి, నాణ్యతపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఆహారంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దశలో శుభ్రతను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## పల్లె వెలుగు బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



పల్లెవెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, మే 2 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ బస్టాండ్ నుంచి మహబూబ్‌నగర్‌కు అదనపు పల్లె వెలుగు బస్సులను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. బస్సులు స్టాండ్ లోకి రాక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఆర్టీసీ అధికారులతో చర్చించి, ఈ సర్వీసులు ఏర్పాటు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ దేవరకద్ర కు వచ్చే బస్సులు బస్టాండ్ వరకు రాకపోవడంతో దేవరకద్ర పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి, ఆర్టీసీ అధికారులతో చర్చించి దేవరకద్ర కు వచ్చే ప్రతి బస్సు బస్టాండ్ కు వచ్చేలా చర్యలు తీసుకుని, బస్సు సర్వీస్‌లు ప్రారంభింప చేశామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడం తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలు కూడా ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, కుష్బూ, ఇనాయత్ అలీ, ఉమ్మి గారి వెంకటేష్, గౌని రాము, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కంకర రోడ్డుతో గ్రామస్తులకు ఇబ్బందులు

**రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ధర్నా**

**బీజేపీ,బిఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయింపు**


ధర్నాలో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు

**వనపర్తి ప్రతినిధి, మే 2, ప్రభాతవార్త :** అసంపూర్తి రోడ్డు పనులలో వెంటనే పూర్తి చేయాలని కోరుతూ పానుగల్ మండల పరిధి లోని కేతేపల్లి గ్రామంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నియోజకవర్గ అసెంబ్లీ కో కన్వీనర్ సంఘన మోని అన్వేష్ మాట్లాడుతూ కేతేపల్లి గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుపై కంకర వేసి డస్ట్ వేయడం జరిగిందని సిసి రోడ్డు వేయకుండా నెలల తరబడి పనుల ు చేపట్టడం లేదని దీంతో ప్రతి నిత్యము దుమ్ము ధూళితో గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు కాంట్రాక్టర్‌కు అనేక పర్యాయాలు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరినప్పటికీ స్పందించడం లేదని అన్నారు. వెంటనే అసంపూర్తి రోడ్డు పనులను పూర్తి చేసేలా హామీ వచ్చేవరకు రోడ్డుపై బైఠా యింపు కొనసాగుతుందని తెలిపారు. రాస్తారోకో దగ్గరికి పాన్‌గల్ ఎస్సై కురుమయ్య చేరుకొని నాయకులతో, గ్రామస్తులతో మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులతో ఫోన్లో సమస్య గురించి వివరించగా త్వరలోనే రోడ్డు పనులను చేపడతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూతగాళ్ల రమేష్, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు ప్రవీణ్,మండల అధ్యక్షులు శివరాం, కౌన్సిల్ మెంబర్ రామకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ నాయుడు, రామకృష్ణ, అశోక్ నాయుడు,అశోక్ రెడ్డి, గంగన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరులో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**మద్దూరు, మే 2 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధి లోని 1వ వార్డు కాపు గేరిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మున్సిపాలిటీ చైర్మన్ సరస్వతి జనార్ధన్, 1వ వార్డు కౌన్సిలర్ సంగీత రమేష్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ సరస్వతి జనార్ధన్ మాట్లాడుతూ రైతులు దళారుల మోసాలకు గురికాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెప్మా కొనుగోలు కేంద్రాలను వినియోగించు కోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకే తమ ధాన్యాన్ని విక్రయించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రద్ధ తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, హరీశ్వర్ రెడ్డి, నిరంజన్ గౌడ్, రవిగౌడ్,బాల్ రెడ్డి,బాలకృష్ణ, చింతల్ దీన్నే వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

## డ్రగ్ అవేర్‌నెస్ ర్యాలీ విజయవంతం

**మాదకద్రవ్యాలకు నో చెప్పండి నినాదంతో ప్రజల్లో అవగాహన**



డ్రగ్ అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, మే 2 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో శనివారం డ్రగ్ అవేర్‌నెస్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి సావర్కర్ చౌరస్తా వరకు జరిగింది. ర్యాలీలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ యువత, విద్యార్థులు, సాధారణ ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనే మాదకద్రవ్యాలకు నో చెప్పండి నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్, క్షేత్రస్థాయి అధికారి సాయి, డీడబ్ల్యుఓ విభాగ సిబ్బంది, వైద్య శాఖ ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల నివారణ, ముందస్తు గుర్తింపు, కౌన్సెలింగ్ సేవల ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించారు. సమాజంలో డ్రగ్ వ్యసనంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.

## ఇంటర్ కొరకు దరఖాస్తు చేసుకోండి

**నర్వ, మే 2 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్ బాలుర , బాలికల జూనియర్ కళాశాలల్లో 2026,27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్ నారాయణపేట జిల్లా కన్వీనర్ కె. హెప్సీ తెలిపారు.ఈ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతి,భోజనం, పుస్తకాలు తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నామని తెలిపారు.ఎంపిసి, బైపిసి,సిఇసి,ఎంఇసి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.2025,2026 విద్యా సంవత్సరంలో అద్భుత ఫలితాలు ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్‌జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు.

**ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలు....** విద్యార్థులు క్రింది వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్//ఎంజెపి టిబిసిఅడ్మిషన్స్.ఓఆర్‌జి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 22.04.2026 దరఖాస్తు చివరి తేదీ: 12.05.2026 .ఈ ప్రవేశాలకు ఎస్ఎస్‌సి మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందనీ, ఎటువంటి ప్రవేశ పరీక్ష ఉండదనీ పేర్కొన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని నారాయణపేట జిల్లా కన్వీనర్ కె. హెప్సీ విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడి సెంటర్లో పౌష్టికాహారం

**పెద్దమందడి,మే 2 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ఆదేశాల మేరకు వేసవికాలం కావడంతో ఒకనెల రోజులు సెలవులు ప్రకటించడం జరిగింది.రెండో అంగన్‌వాడి సెంటర్లో గర్భిణులకు, బాలింతలకు చిన్నారులతో పౌష్టికాహారం స్థానిక సర్పంచ్ సూర్య గంగమ్మ రవి పంపిణీ చేశారు. గర్భిణులు బాలింతలు చిన్నారులు వేసవికాలంలో జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో బయటికి వెళ్ళకూడదు అన్నారు. అంగన్‌వాడి సెంటర్లో ఇచ్చిన పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ సూర్య గంగమ్మ రవి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్,గర్భిణులు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోస అధికారులకు పట్టదా..?

**ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం**

**కొనుగోలు కేంద్రాలలో నెలల తరబడి రైతుల పడిగాపులు**

**రైతులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించని దుస్థితి**

**జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు పూర్తిగా విఫలం**

**క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించాలి**

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్‌గౌడ్**


మార్కెట్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాచాల యుగందర్ గౌడ్

**వనపర్తి,మే2,ప్రభాతవార్త :** ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్న రైతులగోస అధికారులకు పట్టదా..? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ మండిపడ్డారు. శనివారం జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారికి కలుగుతున్న ఇబ్బందులనుఅడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వడ్లు, మక్కజొన్నలు, వేరుశెనగ ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం రైతులకు తాగడానికి మంచినీటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి మార్కెట్ యార్డులో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ సమస్య ఉందని అధికారులు సాకులు చెబుతూ రైతులను నెలల పాటు పాటు ధాన్యం రాశుల దగ్గర పడిగాపులు కాసే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు.చలికి, ఎండకు, వానకు సంబంధం లేకుండా ప్రతినెల క్రమం తప్పకుండా ప్రభుత్వం అధికారులకు వేతనాలు చెల్లిస్తుంటే, రైతులు మాత్రం ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి నిరీక్షించాలా? అని ప్రశ్నించారు.కేవలం పైపై సమీక్షలు చేస్తే సరిపోదని,అధికారులు, ప్రజా పతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిలదీశారు. జిల్లాలో సివిల్ సప్లయ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదనే విషయాన్ని గత అనేక సందర్భాల్లో బీసీ పొలిటికల్ జెఏసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.జిల్లాలో దాదాపు 60 రైస్ మిల్లులు ఎలిజబుల్ అయితే వాటిలో ఇప్పటికీ 26 రైస్ మిల్లులకు మాత్రమే ట్యాగింగ్ చేసినట్లు సమాచారం ఉందన్నారు. సన్నాలకు బోనస్ ఇస్తున్నారని ఉద్దేశంతో రైతులు సన్నవడ్లు పండిస్తున్నారని, మరి లావు వడ్లు పండిస్తున్న రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారులు రైతులను నిలువునా ముంచి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, తక్షణమే ధాన్యం కాంటాలు చేసి ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్రకార్యదర్శి వివిగౌడ్,నాగర్‌కర్నూల్ జిల్లా అద్యక్షులు అరవిందా చారి, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్,మదనాపూర్ మండలఅధ్యక్షులు మహేందర్ నాయుడు, శ్రీరంగాపూర్‌మండల అద్యక్షులు ధర్మేందర్‌సాగర్,ప్రధాన కార్యదర్శ అస్కని రమేష్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్...

**మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ధ్వజం**

**వడ్లు కొనుగోలు చేయాలంటూ మండుటెండలో రాస్తారోకో**


రాస్తారోకో లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**ఆత్మకూర్ మే2, ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను నిట్టనిలువునా వంచనపు గురిచేస్తుందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ప్రభుత్వ అధికారులు గానీ పాలకులు గానీ, వడ్లు కొనుగోలు చేయకుండా రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆరోపిస్తూ శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మండుటెండలో రైతుల పక్షాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం కూల్చివేతలు తప్పిస్తే నిర్మాణాలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవని హైడ్రా పేరుతో పేద ప్రజల పొట్ట కొడుతూ బడా బాబులకు ఆశ్రయం కల్పించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు రైతుల పక్షపాతిగా నిలుస్తూ ప్రతి కరూర్ సీజన్కు గాని రవి సీజన్లో గాని రైతుబంధు ద్వారా రైతులకు సాయం చేసి రైతులను ఆదుకుంటే ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ రాష్ట్రవ్యాపితంగా ఇప్పటికే రెండుమార్లు రైతుభరోసాని ఎగ్గొట్టిన ఘనత రేవంత్‌రెడ్డి కే దక్కుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల ఉసురు పోసుకున్న నాయకుడు చరిత్రలో మనం కూడా సాధించిన దాఖలాలు లేవని ఆయన శాపనార్థాలు కల్పించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ఫోటోలకు మాత్రమే పరిమితం కాకుండా తక్షణమే మతద్దరకు వడ్లు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్ పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతాంగం ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసి కొనుగోలు కేంద్రాలకు వడ్లను తరలించినప్పటికీ కనీసం గన్ని బ్యాగులు కూడా సరఫరా చేయలేకపోవడం పాలకుల చేతకానితనానికి నిదర్శనమన్నారు.అనంతరం ఆత్మకూర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ మాజీ మండల పరిషత్ అధ్యక్షులు బంగారు శ్రీనివాసులు రేచింతల సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి బిఆర్ఎస్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు జానకి రాములు సీనియర్ నాయకులు మండల రామకృష్ణ, కొత్త బోయ శేఖర్, కోటేశ్వర్, వెంకటేష్, అజపాగ మాసన్న, షరీఫ్, తదితరతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలి

**ఉప్పునుంతల,మే 2 ప్రభాతవార్త :** రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు అన్నారు.శని వారం మండల కేంద్రమైన ఉప్పునుంతల రైతు వేదిక లో ప్రొ॥ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పాలెం శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి హాజరైన శాస్త్ర వేత్త డా. కె.మమత వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, వివిధ పంటలకు వాడవలసిన యూరియా మోతాదుల గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా అధిక యూరియా వాడడం వల్ల జరిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించారు. అదేవిధంగా నీటిని సంరక్షించే వివిధ పద్ధతులను డ్రిప్పు,స్ప్రింకర్ల ద్వారా పంటల సాగును, డ్రిప్ ద్వారా ఫెర్టిగేషన్ తద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచుపాలని సేంద్రియ వ్యవసాయం ద్వారా మంచి నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చని అని కోరారు. డా. జి ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ పంటల్లో రసాయన ఎరువుల వాడకం, సరైన సమయంలో సరైన రసాయన మందులను వాడటం సమగ్ర పద్ధతుల ద్వారా రసాయన మందుల వినియోగాన్ని తగ్గించడం, పురుగు మందులు, కలుపు మందుల పిచికారి చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలంగాణ రాష్ట్రానికి అనుకూలమైన మార్కెట్ డిమాండ్ గల వరి రకాలను రైతులకు వివరించారు. అదేవిధంగా రైతులు పంటల మార్పిడి చేపట్టాల్సిందిగా వాణిజ్య పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిందిగా రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక మండల విస్తీర్ణ అధికారిణి మంజుల పంటల కాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులు పశుసంపద ను పెంచుకోవాలని, తద్వారా సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని, రసాయన మందులు, పురుగుమందులు అధిక మోతాదులో వాడటం వల్ల పంటలు దెబ్బతిని ప్రమాదం ఉంటుందని అట్టి పంటను చిన్న పశువులు పోషక లోపలపడే అవకాశం ఉంటుందని, వివిధ రకాల రోగాలకు కారణమవుతాయని ఆయన రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. రైతులు కొన్ని అంశాలను శాస్త్రవేత్తలకు సూచించారు. యాంత్రికరణ నాణ్యమైన విత్తనాలు, వివిధ దశలో వివిధ పంటల్లో వేయవలసిన కలుపు,మందులు మోతాదు అంశాల పైన అవగాహన కార్యక్రమాలు పెంచ వలసిందిగా శాస్త్రవేత్తలను రైతుల కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం శాస్త్రవేత్తలు డా. కె. మమత, డా. జి ఈశ్వర్ రెడ్డి, మండల విస్తీర్ణ అధికారి ణి మంజుల, పశువైద్యాధికారి డా. ప్రవీణ్, పిఎసిఎస్ సీఈఓ కొత్త రవీందర్ రావు,స్థానిక సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో సీఈవో జగదీశ్వర్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు


ఘనంగా వీడ్కోలు పలుకుతూ సన్మానం చేస్తున్న దృశ్యం

**పెద్దమందడి, మే 2 ప్రభాతవార్త :** పెద్దమందడి సింగిల్ ఉండు సీఈవో జగదీశ్వర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం శనివారం పెద్దమందడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, యూనియన్ నాయకులు రైతులు సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై జగదీశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగదీశ్వర్ రెడ్డి తన ఉద్యోగ జీవితంలో నిజాయితీ క్రమశిక్షణ సేవా భావంతో పనిచేసే రైతులకు అందుబాటులో ఉంటూ సమస్త అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. రైతు సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ సహనంతో వివరించిన తీరు అందరికీ ఆదర్శంగా వచ్చిందని కోరుకుంటున్నాను అన్నారు. సింగిల్ విండో అభివృద్ధి రైతులకు అవసరమైన సేవలు అందించడంలో జగదీశ్వర్ కీలకపాత్ర పోషించారని సమాచారంతో స్నేహపూర్వంగా వివరించి మంచి గుర్తింపు పొందాలని నాయకులు కూడా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. తనకు సహకరించిన ప్రజాప్రతిని రైతులు సహచర సిబ్బందికి జగదీశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జీవితంలో అందరి సహకారంతోనే బాధ్యతలు సమాంతరంగా నిర్వహించ గలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటుచే కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మధు ప్రసాద్, ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు, మాజీ మండలం రైతుబంధు అభ్యర్థులు ప్రకాష్ రెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మఖ్తల్‌లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**మక్తల్ టౌన్,మే 2 ప్రభాతవార్త :** మఖ్తల్ నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం ద్వారకా ఫంక్షన్ హాల్ సంగంబండ రోడ్ మఖ్తల్‌లో నిర్వహించారు.ఈ సమా వేశంలో జిల్లా అధికారులు శాఖల వారిగా ప్రస్తుత పథకాలు రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), మహాలక్ష్మి (రూ. 500లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్) మొదలైనవి.రాబోయే పథకాలు బ్రేక్‌ఫాస్ట్ పథకం (రాగి జావ/పాలు), ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా పంట వైవిధ్యీకరణ కార్యక్రమాల పై అవగాహన కల్పించడం జరిగిందని వివరించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫణీంద్ర రెడ్డి, మునిసిపాలిటి చైర్ పర్సన్ మానస హనుమంతు, వైస్ చైర్మన్ శివిరెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు, మునిసిపాలిటి కమీషనర్,వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, మండల ప్రత్యేక అధికారులు జిల్లా అధికారులు హాజరైనారు.

## బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ డీకే అరుణ

**ఎర్రవల్లి మే 2, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పురంధర్ కుమార్, అర్చకులు ఎంపీ డీకే అరుణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చనలు చేసి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు

## ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మొక్కజొన్న పంట దగ్ధం

**అచ్చంపేట, మే,2 ప్రభాతవార్త:** బల్మూరు గ్రామానికి చెందిన కాగుల బక్కయ్య, వెంకటస్వామి అనే రైతులు అంబగిరి గ్రామ సమీపంలో తనకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. తీరా చేతికి వచ్చిన పంటను కోసుకునే సమయంలో శనివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని అగ్నికి ఆహుతి అయిందని రైతులు తెలిపారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న వారు మంటలను ఆరిపారు. దీంతో రైతులకు రూ.60 వేల ఆస్థినష్టం జరిగినట్లు తెలిపారు. చేతికి వచ్చిన పంట కళ్ళముందే కాలిపోవడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. పంట పూర్తిగా కాలిపోవడంతో రైతు జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## దివ్యాంగులకు ఉచిత కోచింగ్

**ఆత్మకూర్ మే 2, ప్రభాతవార్త ;** ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి దివ్యంగులు, అనాధలకు లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ ద్వారా నవోదయ, గురుకుల, సైనిక్ పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకుగాను ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లుగా అకాడమీ అడ్వైజర్ మీర్జా ఆఫ్జర్ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు.రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనాధ పిల్లలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్లుగా ఆయన తెలిపారు. గడచిన 25 సంవత్సరాలుగా గురుకుల, నవోదయ పాఠశాలల్లో తమ సంస్థ నుండి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి ప్రవేశాలు పొందారని అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి దివ్యాంగులు, అనాధ పిల్లలు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కేంద్రమైన ఆత్మకుర్ పట్టణంతో పాటుగా వనపర్తి జిల్లా కేంద్రంలో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినట్లుగా తెలిపారు.

## కల్వరాల గ్రామ వాసికి అరుదైన గౌరవం

**వీపనగండ్ల మే 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన జనుంపల్లి విజయభాస్కర్ రెడ్డి శ్రమశక్తి అవార్డు మే డే సందర్భంగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి రీత్యా హైదరాబాదులో గత 20 సంవత్సరాల అనేక పనులు చేసుకుంటూ హైదరాబాదులో స్థిర పడ్డాను అన్నారు.మేడే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి, కార్మిక శాఖ మంత్రి చేతులు మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.ఈఅవార్డు రావడం చాలా గౌరవంగా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులకు అన్ని విధాలుగా తోడుంటానని విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ సుధాకర్ రావు, అమరేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, ధరణిధర్ , కార్మికులు తదితరులు ఉన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ



**వనపర్తి రూరల్, మే 2 ప్రభాతవార్త:** వనపర్తి మండలం కదుకుంట్ల గ్రామానికి చెందిన టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ మధు గౌడ్ మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సింగిరెడ్డి వాసంతి శనివారం జర్నలిస్ట్ మధుగౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కె. మాణిక్యం, సీనియర్ నాయకులు అడ్వకేట్ శివన్న, చిట్యాల రాము, సర్పంచ్ తిరుపతయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షులు మనీష్, గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, బంధుమిత్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**బిజినపల్లి, మే 2 ప్రభాతవార్త:** ప్రతి గ్రామంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తుందని దీంతో రైతులు ఎటు తోచక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనిని అదునుగా చూసుకున్న ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలు రూ.1700, 1800 మాత్రమే కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం మక్క, జొన్నలు కొనుగోలు చేస్తే గన్ని బ్యాగులు అందించడం లేదని కొనుగోలు చేసిన తర్వాత కూడా తీసుకెళ్లడానికి నాలుగు ఐదు రోజుల సమయం పడుతుందని రైతులు వాటకి కావలి ఉండాల్సి వస్తుందని అన్నారు .అకాల వర్షాలతో తడిసిన ప్రతి మొక్కజొన్న గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బోనాసి శుభకర్, మల్లేష్, అన్నారం, కాశమ్మ, వెంకటేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి పెద్ద రథోత్సవం

**వెల్దండ, మే 2 ప్రభాతవార్త :** మండలంలోని బైరాపూర్ గ్రామంలో వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కనుల పండువగ కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రజలతో పాటు హైదరాబాదులో ఉన్న తమ బంధువులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద రథోత్సవానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. శనివారం తెల్లవారుజామున శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి పురోహితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవ ద్వారా స్వామి వారిని రథంపై ఆసీనులను చేసి ఒక్కసారిగా గోవింద నామ స్మరణతో భక్తులు రథోత్సవాన్ని లాగగా గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారు మోగింది. గ్రామ పురవీధుల గుండా తిప్పి విధిగా స్వామి వారిని దేవాలయానికి తీసుకొచ్చారు. భక్తులు తమ ఇష్టదైవాన్ని మొక్కి తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై కురుమూర్తి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల రాజు యాదవ్ నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి, రమేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, జంగయ్య, నరసింహ, శ్రీశైలం తోపాటు తదితరులు ఉన్నారు.

## గర్భిణీ స్త్రీలు,చిన్నారుల తల్లులు అంగన్‌వాడీలను వినియోగించుకోవాలి

**కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్**

**కల్వకుర్తి,మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషక ఆహార పదార్థాలను బాలింతలు,గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు వినియోగించుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ సూచించారు. శనివారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులకు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్,అంగన్‌వాడీ టీచర్ ఫాతిమాతో కలిసి పౌష్టిక ఆహారంతో పాటు పాలు, గుడ్లు పంపిణీ చేశారు. అనంతరం కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే ఆహార పదార్థాల్లో ఎన్నో రకాల పోషక విలువలు ఉంటాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బాలింతలు, గర్భిణీ స్త్రీలు చిన్నారుల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఘనంగా పూలే అంబేద్కర్ 4వ జాతర భీమ్ ర్యాలీ

**అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత ముందుకు రావాలి విశారదన్ మహరాజ్**

**నారాయణపేట, మే 2( ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో పూలే-అంబేద్కర్ 4వ జాతర సందర్భంగా భారీ భీమ్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో బారం భావి నుంచి శీల గార్డెన్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఆయన సిద్ధాంతాల సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు యు. మహేష్, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలు, గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి జాతర విజయవంతానికి కృషి చేశామని తెలిపారు. పూలే, అంబేద్కర్ ఆశయాల సాధన, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి సంవత్సరం జాతర నిర్వహిస్తున్నామని చెప్పారు. ర్యాలీలో ప్రజానాట్యమండలి కళాకారుల డప్పుల కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

## కుట్టు మిషన్ల పంపిణీతో మహిళలకు స్వయం ఉపాధి

**మక్తల్ టౌన్, మే 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక క్రీడా డెయిరీ మత్స్యశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో మక్తల్ పట్టణంలో సుమారు 200 మందికి పైగా మైనారిటీ మహిళలకు మైనార్టీ కార్పొరేషన్ తరపు నుంచి ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం సంతోషంగా ఉందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పట్టణంలోని 16 వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ అల్వారి పావని ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతోనే తమకు కుట్టుమిషన్లు అందాయని అన్నారు. కుట్టుమిషన్లతో స్వయం ఉపాధి అందుతుందని, అందుకు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మక్తల్ ప్రాంతంలోని మహిళలకు హైదరాబాద్ నుంచి ఆర్డర్లు అందించి కనీస ఉపాధి అందించే దిశగా మంత్రి హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాలంబిన్ ఉమర్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్ ,16వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్ నారాయణ, రంజాన్, టింగిలి గోపాల్, మహమ్మద్, అక్కల రాకేష్ కుమార్ ,వలంపల్లి మధు, ప్రవీణ్ కుమార్, గురు రాజ్, కడేచూర్ రాజేష్, అన్నం పల్లి రమేష్, ఖజా మైనుద్దీన్, అమ్రేష్, దామరగిద్ద రాము, జావిద్ ,జాకీర్, గఫర్, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుడు పాగా పుల్లారెడ్డికి ఘనమైన నివాళులు

**గద్వాల మే 02, ప్రభాతవార్త :** గద్వాల మాజీ శాసనసభ్యులు స్వర్గీయ శ్రీ పాగా పుల్లారెడ్డి 107వ, జయంతోత్సవ వేడుకలు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు సంగాల అయ్యపు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ రాజీవ్ మార్గ్ లో ఉన్న స్వాతంత్ర సమరయోధుడు, గద్వాల మాజీ శాసనసభ్యులు స్వర్గీయ పాగా పుల్లారెడ్డి జయంతోత్సవం సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయ్యపు రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ పాగ పుల్లారెడ్డి గద్వాల శాసనసభ్యులుగా ఉన్న సమయంలో ఆయన చేసిన పలుఅభివృద్ధి పనులు చాలా ఉన్నాయని, నడిగడ్డ ప్రాంతంలో జూరాల ప్రాజెక్టును చేపట్టి తాగునీటి, సాగునీటిని అందించారని, వ్యవసాయ రంగానికి చాలా కృషి చేయడం జరిగిందన్నారు. గద్వాల రైల్వే స్టేషన్, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్, గద్వాల సంస్థా నాదిశుల కాలం నుండి నృత్య కళాకారులకు పుట్టినిల్లుగా ఉన్న గద్వాల బాల భవన్, తాగునీటి కోసం కృష్ణా నది అగ్రహారం నుంచి మంచి నీటి సౌకర్యం, చదువుకోవడానికి విద్యార్థినీ విద్యార్థుల కొరకు కళాశాలల ఏర్పాటు కల్పించడం జరిగిందన్నారు. పాగ పుల్లారెడ్డి ఎమ్మెల్యేగా వున్న కాలంలో ఆయన చేసిన కృషి ఫలితంగానే గద్వాల నడిగడ్డ ప్రాంతం విద్వత్ గద్వాలగా దినదిన అభివృద్ధి దిశగా అభివృద్ధి చెందిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాగా పుల్లారెడ్డి గారి కుటుంబ సభ్యులు, సీనియర్ సిటిజన్ నాయకులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువ పత్రాలు తయారీ గుట్టురట్టు

**అయిజ మే 02, ప్రభాతవార్త :** మున్సి పాలిటీ కేంద్రంలో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసిన లక్ష్మీ నరసింహ ప్రిం టింగ్ ప్రెస్ పై రెవిన్యూ అధికారులు దాడి చేసి గుట్టురట్టు చేశారు.శనివారం మండల తహసిల్దార్ జ్యోతి ఆదేశాల మేరకు ఆర్.ఐ రజినీకాంత్ రెడ్డి మరి యు జీపీవోలు లక్ష్మీనరసింహ ప్రింటింగ్ ప్రెస్‌పై దాడులు నిర్వహించారు.ఈ దా డుల్లో వివిధ శాఖలకు సం బంధించిన గవర్నమెంట్ డాక్టర్స్,సర్పంచులు,హె డ్మాస్టర్లు, మ్యారేజ్ సర్టిఫికెట్స్ ఆధార్ కార్డులు, ఎస్ఎస్సి మెమోలు,తదితర నకిలీ ధ్రువపత్రాల కు సంబంధించిన ముద్రలు రాయలసీమలోని వివి ధ జిల్లాలకు సంబంధించిన ముద్రలు, గట్టు మండలం కు ముద్రలు పెద్ద ఎత్తున సుమారు 18 దొరికాయి. అలాగే కంప్యూటర్ ని ఓపెన్ చేయగా సుమారు 150 పైగా వివిధ పత్రాలు నకిలీవి తయారు చేసినట్టు గుర్తించారు. అనంతరం సిపిఓ కంప్యూటర్ తదితర వాటిని స్వాధీనం చేసుకొ ని దర్యాప్తు నిమిత్తం పోలీస్ డిపార్ట్మెం టు అప్పచెప్పినట్లు తెలిపారు. ఈ విషయమై తాసిల్దార్ మాట్లాడుతూ మాకు వచ్చిన నమ్మదగిన సమాచారం, కంప్లైంట్ మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యక్ర మాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ తో పాటు జిపిఓ లు జ్యోతి, రహమతుల్లా, బాలు ఉన్నారు.



నకిలీ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహకారం

**నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి**

**తాడూరు మండలంలో ఇళ్ల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్,మే 2 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇటీవల గృహప్రవేశం చేసిన లక్ష్మమ్మ లబ్ధిదారులు, గృహప్రవేశానికి సిద్ధం చేస్తున్న కమలమ్మ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను జిల్లా సందర్శించి, నిర్మాణ నాణ్యత, సదుపాయాలు, ప్రభుత్వ సహాయం వినియోగం తదితర అంశాల పై సమగ్రంగా కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల స్వగృహ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని, నిర్మాణ పనులను మధ్యలో ఆపకుండా నిరంతరంగా కొనసాగించాలని, నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం ప్రతి సోమవారం నిధులను జమ చేస్తున్నదని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని, లబ్ధిదారులు పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు, భూసంబంధిత సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో తరచూ పర్యటిస్తూ, పనుల పురోగతిని పర్యవేక్షి ంచి, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాడూరు మండల పరిధిలో మొత్తం 515 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 419 ఇండ్లకు భూమి పూజ పూర్తి చేయడం జరిగిందని, 97 ఇండ్లు బేస్మెంట్ లెవెల్, 43 ఇండ్లు రూఫ్ లెవెల్, 135 ఇండ్లు స్లాప్ లేవల్, 65 ఇండ్లు పూర్తి చేసినట్లు, ఇంకా 1079 ఇండ్లు నిర్మాణానికి ప్రారంభం కాలేదని పిడి హౌసింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాడూరు మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల వివరాలను పరిశీలించిన కలెక్టర్, కొంతమంది లబ్ధిదారులు పనులను ఆలస్యం చేస్తున్నారని గమనించి, అలాంటి వారు వెంటనే పనులను పునఃప్రారంభించి వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, సమయానికి ఇళ్లు పూర్తి చేయడం ద్వారా కుటుంబ స్థిరత్వాన్ని సాధించుకోవాలని అన్నారు.అంతకుముందు తాడూరు గ్రామ పరిధిలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన 104 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకునేందుకు వారు సమ్మతంగా ఉన్నారా లేదా అనే వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామానికి దూరంగా ఉండటం గ్రామస్తులు ఇక్కడ ఇండ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని ఈ నిర్మాణాలను ఏదైనా గురుకుల పాఠశాలలకు కేటాయించాలని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ సంగప్ప, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజినీరింగ్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామస్థాయి అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా పనిచేయాలి

**నారాయణపేట, మే 2 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ" నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా ఎన్నికైనసర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లు మంచి పరిపాలన అందించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ప్రభుత్వం మార్చి 6 నుంచి ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా పలు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి వారం ఒక అంశంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 26న జిల్లా స్థాయి, జూన్ 2న రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం, ఇంటర్మీడియట్ వరకు భోజన పథకం విస్తరణ, కుటుంబ బీమా, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహం, వికలాంగులు, విద్యార్థులకు వాహనాల పంపిణీ వంటి చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు 162 కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే చెల్లింపులు జమ అవుతాయని చెప్పారు.



చెక్కు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీను

అలాగే జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలని కోరారు పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తీర్ణత శాతం 98%కి పెరిగినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణంతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు.

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని,ఉదయం 11గంటలలోపు పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల,మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి కళ్లు,చెవులు విప్ లే

**ప్రభుత్వ విప్‌లతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌గర్ బ్యూరో మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్ లే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో శాసనసభ, శాసనమండలి విప్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్‌లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవి నేపథ్యంలో నియోజవర్గాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలకు తీసుకోవల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రభుత్వ విప్ లతో సమన్వయం చేసుకునేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్‌లకు అందుబాటులో ఉంటానని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**పరీక్ష రాసే అభ్యర్థులు నిబంధనలను పాటించాలి**

**శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక**

**గద్వాల, మే 02,ప్రభాతవార్త :** నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈనెల 3వతేదీన నిర్వహించే నీట్‌పరీక్షకు సంబంధించి శనివారం గద్వాలప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాల,బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. జిల్లాలో నీట్ పరీక్షకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సిఎస్‌లు, అబ్జర్వర్లు, తహసిల్దార్‌లు,పోలీసుశాఖ అధికారులు,తదితరులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి గదిలో 24 మంది అభ్యర్థులకు ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉంటారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. జాతీయస్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ పరీక్షలో చిన్నతప్పిదం జరిగినా అభ్యర్థు లందరూ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జిల్లాలో గతేడాది నీట్ పరీక్షను విజయవంతం చేసినట్లే ఈ ఏడాది కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. హాల్ టికెట్ల ను జాగ్రత్తగా పరిశీలించి అభ్యర్థులను కేంద్రం లోపలికి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా సిద్ధమై పరీక్ష రాసేందుకు రావాలన్నారు. అభ్యర్థులు షూస్ కూడా వేసుకోవడానికి అనుమతి లేనందున స్లిప్పర్స్ వేసుకురావాలన్నారు. పరీక్ష రాసేటప్పుడు ఓఎంఆర్ షీట్ లో కొంతమంది అభ్యర్థులు సెంటర్, ప్రశ్నాపత్రం కోడ్, తదితర అంశాలను తప్పుగా రాస్తుంటారని, వారికి ఇన్విజిలేటర్లు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడమే కాక అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్, తహసిల్దారులు నరేష్, నందిని, విజయ్ కుమార్, ఇతర అధికారులు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్

**కల్వకుర్తి,మే2 ప్రభాతవార్త:**ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను అమలు చేస్తున్న ది కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని సికెఆర్ ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి నియోజకవర్గం స్థాయి సమావేశం అన్ని మండలాల ప్రజ ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా, అన్ని ప్రభుత్వ సంక్షేమపథకాల అమలుపై సమావేశం ఎమ్మెల్యే అధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, మహిళలకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, ఇందిరమ్మ ఇళ్ల, ఉచిత రేషన్ బియ్యం, రేషన్ కార్డులు, ఉద్యోగులు, రైతు బంధు, రైతు రుణమాఫీ, కోనుగోలు కేంద్రలు, మహిళా సంఘం రుణాలు, గిట్టుబాటు ధర, సన్న రకం వరికి ప్రోత్సాహం ధర, ఇలా చెప్పాని, చెప్పక పోయినా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పది సంవత్సరాలు ఏలిన ప్రభుత్వం ప్రజా సంక్షేమం పక్కన పెడితే ఈ ప్రభుత్వం అప్పులు తెచ్చి గత పాత ప్రభుత్వ బాకీలు చెలిస్తూ ప్రస్తుతం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. సమవేశంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యక్షంగా పథకాల అమలు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి బాలాజీ సింగ్, పురపాలక సంఘాల చైర్మన్ లు,పాలక వర్గం, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్‌లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, అన్ని మండలాల శాఖల అధికారులు, తహశీల్దార్ లు,మండల పరిషత్ అధికారులు, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య, విద్యా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## గుర్తు తెలియని వ్యక్తి మృతి.. కేసు నమోదు

**బాలానగర్, మే 2 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని బోడగుట్ట తండా గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల మేరకు కార్తికేయ క్రషర్ సమీపంలో సుమారు 25 నుండి 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై లెనిన్ వెల్లడించారు.

## భక్త సందోహం మధ్య రథోత్సవం



రథోత్సవ ప్రారంభానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**వంగూరు, మే 2 ప్రభాతవార్త :**వంగూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం తెల్లవారుజామున భక్త సందోహం మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా,వేదపండితుల మంత్రచరణతో భక్తులు కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు జై నరసింహ స్వామి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం నుంచి శ్రీ గెల్వలాంబా మాత ఆలయం వరకు ఆనంద హేళిలో రథాన్ని లాగుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కరుణ కటాక్షాలు ఎల్లవేళలా మా ఇంటిల్లిపాదిపై ఉండాలంటూ మమ్మల్ని రక్షించయ్యా అంటూ రథోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఆలయ ధర్మకర్త చిరుకేశ్వరం రాజన్న స్వామి అర్చకులు భక్తవత్సల్ సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి రాథోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించారు.రథోత్సవంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## నేడు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభం

**వెల్దండ,మే2 ప్రభాతవార్త :**మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలోప్రభుత్వ బాలికల పాఠశాలలో నేడు ఆదివారం ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఐక్యత పౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్దండ మండల పరిసర ప్రాంతాలలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు గొప్ప అవకాశం అని రాష్ట్రస్థాయి నిపుణులు లైన అధ్యాపకుల చే ప్రతిరోజు 9 గంటల సమగ్ర శిక్షణ ఉంటుందని అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

## వార్డు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా..

**కల్వకుర్తి, మే 2 ప్రభాతవార్త :** కల్వకుర్తి మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్..రాఘవేంద్ర కాలనీలో జరుగుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ పనుల పరిశీలన..కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు వార్డు అభివృద్దే ధ్యేయంగా పని చేస్తానని కౌన్సిలర్ షేక్ ఏజాస్ పేర్కొన్నారు.కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు రాఘవేంద్ర కాలనీలో జరుగుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను శనివారం మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఏజాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులతో పాటు సంబంధిత గుత్తేదారుకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఏజాస్ వెంట రాఘవేంద్ర కాలనీవాసులు ఉన్నారు.

## పెంట్లవెల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, మే 2, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న పంటను తరలించేందుకు లారీల కొరత ఉందని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మొక్కజొన్న కొనుగోలు చేసిన వెంటనే రవాణా జరిగేలా చూడాలని, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చిన వెంటనే తూకం వేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులు తమ పంటను నిబంధనల ప్రకారం నిర్ణీత తేమ శాతం, నాణ్యత ప్రమాణాలతో కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పెంట్లవెల్లి మండలంలో కేంద్రం ఏర్పాటుతో పరిసర గ్రామాల రైతులకు రవాణా ఖర్చులు తగ్గి, సమయం ఆదా అవుతుందని, దళారుల బెడద లేకుండా రైతులకు మెరుగైన మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జటప్రోల్ గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడకూడకుండా పనులు వేగవంతం చేయాలని గుత్తేదారులను,కాంట్రాక్టర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు,మంత్రి వెంట అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


### పదిలో వంద శాతం ఫలితాలే లక్ష్యం, విద్యా శాఖపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష

**గద్వాల మే 02,ప్రభాతవార్త :** మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు త్వరలో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలపై శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విద్యాశాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాలు, విద్యార్థుల నమోదు, పాఠశాల మౌలిక వసతులపై కీలక సూచనలు జారీ చేశారు. ప్రతి పాఠశాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితాను సబ్జెక్టు వారీగా సిద్ధం చేసి, వారికి 15–20 రోజుల పాటు ప్రత్యేక రీమిడియల్ తరగతుల ద్వారా సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. వారం రోజుల్లో పరీక్ష ఫీజులు చెల్లింపులు పూర్తి చేయించి, జూన్ లో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల కోసం కేజీబీవీలలో భోజన వసతి సౌకర్యాలతో పాటు, బాలురకు ప్రత్యేక పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ వంటి తదితర కోర్సులపై అవగాహన కల్పించి, విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారి అడ్మిషన్ల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ వారోత్సవాల్లో పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రారంభం, రీమిడియల్ క్యాంపులు, సర్పంచ్‌లతో వర్క్‌షాప్, బడిబాట ద్వారా నమోదు పెంపు, లైబ్రరీ దినోత్సవం, ఆర్ట్‌క్రాఫ్ట్ కార్యక్రమాలు, బాలభవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరుగుదొడ్లు, మరమ్మతులు, విద్యుత్ సదుపాయం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు, విద్యా వారోత్సవాలు సమర్థవంతంగా నిర్వహించాలి

### అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వీయ గణన చేయాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం




**నాగర్‌కర్నూల్,మే 2 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించనున్న రైతు వారోత్సవాలు, విద్యా వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపిడిఓలు, ఎంపీఓలతో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలన, స్వీయ గణన, ఉపాధి హామీ పథకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మే 4 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రైతువారోత్సవాలను రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## వాడియాల గ్రామంలో వృద్ధుడు ఆత్మహత్య

**మిడ్జిల్, మే 2 ప్రభాతవార్త :** మండలంలోని వాడల గ్రామానికి చెందిన గడ్డల శంకరయ్య (65) ఇంట్లో కిటికీకి ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన గ్రామంలోని విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారము ఆయన భార్య పోశమ్మ బర్రెల వద్దకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఇంట్లో ఉన్న వృద్ధుడి కోడలు గమనించి గ్రామస్తుల సహాయంతో అంబులెన్స్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది శంకరయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉనట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు తీవ్ర విషయంలో మునిగిపోయారు.

## అక్రమ ఇసుక రవాణా పై పోలీసుల ఉక్కు పాదం ..



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

**మిడ్జిల్, మే 2 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండో టిప్పర్లను పోలీసులు శనివారం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ చేసి పట్టుకున్నారు. అలాగే మిడ్జిల్ గ్రామ శివారులో మిడ్జిలకు చెందిన ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఘటనను కూడా పోలీసులు గుర్తించి వాహనాన్ని శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు దాడులు నిర్వహించి ఈ రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు చేసుకుంటామని ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

# పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలి

### రోడ్డు భద్రతకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కుష్బూ గుప్తా, చిత్రంలో ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 2, ప్రభాతవార్త :** జిల్లాలోని జాతీయ రహదారులపై పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, రోడ్డు భద్రత కు సంబంధించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పోలీస్, ఆర్అండ్‌బీ (ఆర్‌బి ), ఎన్ హెచ్ ఆర్అండ్‌బి , జాతీయ రహదారి అథారిటీ అధికారులు,ఇతర డిపార్టుమెంట్‌తో పరస్పరం సమన్వయం చేసుకుని జిల్లాలోని రహదారుల పై, జరుగుతున్న, పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సైన్‌బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ, ట్రాఫిక్ సిబ్బంది, రహదారులపైన రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసి, వాహన రాకపోకలు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష చేసి, ప్రగతిని తెలుసుకున్నారు. ఎన్ హెచ్‌ఏ ఐ అధికారులు గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 మీద బాలానగర్ ఫ్లైఓవర్, రాజాపూర్ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ పనులు గ్యాస్, డీజిల్ కొరత కారణంగా పనులు మందగించాయని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్, బాలానగర్ ఫ్లైఓవర్ పనులను మే నెలాఖరులోపు పూర్తి చేసి ట్రాఫిక్ సాఫీగా నడిచేలా చూడాలని ఆదేశించారు.పెద్దయ్యపల్లి ఎక్స్‌రోడ్స్ వద్ద సైన్‌బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్ వంటి పెండింగ్ పనులను 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మాదారం ఎక్స్ రోడ్ వద్ద సైన్‌బోర్డులు పూర్తి చేయడంతో పాటు, మిడ్జిల్ మండలంలోని మన్ననూర్ ఎన్‌హెచ్ 167 టోల్‌ప్లాజా వద్ద సైన్‌బోర్డుల పరిమాణాన్ని పెంచాలని సూచించారు. ఎన్‌హెచ్ 44 మీద రాజాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్ల మార్పిడి పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, తహసీల్దార్ పరస్పరం సమన్వయం చేసుకుని పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.ముదిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ ప్రతిపాదనలపై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు వివరాలు అందజేసి, అనుమతుల కోసం పంపినట్లు తెలిపారు. రాయికల్ టోల్ ప్లాజా నుంచి అడ్డకల్ టోల్‌ప్లాజాల మధ్య లైటింగ్ ఏర్పాటు అవసరాన్ని కలెక్టర్ ప్రస్తావించగా, అధికారులు రోడ్డు ని పరిశీలించి అవసరం ఐన్ చోట ఏర్పాటు చేస్తామని తెలిపారు.ముదిరెడ్డిపల్లి నుంచి మల్లేబోయినపల్లి వరకు రైల్వే మరియు ఎన్‌హెచ్‌ఎఐ సంయుక్తంగా చేపట్టిన రోడ్డు పనులు మందగించినప్పటికీ, భద్రతా చర్యలుగా బ్యారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.తాటిపర్తి ( దివిటిపల్లి) ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో వాహన రాకపోకలు సాఫీగా ఉండేందుకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉడిపి కృష్ణ హోటల్ సమీపంలో గత మీటింగ్ లో నిర్ణయించినట్టు సైన్‌బోర్డులను ఏర్పాటు చేసినట్టు అధికారులు కలెక్టర్ కు తెలిపారు.జడ్చర్ల-కల్వకుర్తి రైల్వే బ్రిడ్జ సమీపంలోని ఎన్‌హెచ్ 167 పై పెండింగ్ సైన్‌బోర్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించగా, ఒక నెలలో పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.అడ్డకల్ సర్వీస్ రోడ్ వద్ద లైటింగ్, పొన్నకల్ జంక్షన్ వద్ద హైమాస్ట్ లైట్స్, అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సూచించారు. జడ్చర్ల-గంగాపూర్ మధ్య డివైడర్ పనుల విషయంలో తాత్కాలికంగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.అమిస్తాపూర్ శ్మశాన వాటిక ప్రాంతంలో, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, స్నేహా పోల్ట్రీ ఫారం సమీపంలోని పెండింగ్ పనులను వచ్చేనెల రోడ్డు భద్రత సమావేశం కల్ల పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్ బస్టాండ్ల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జల ప్రతిపాదనలను కూడా వేగవంతం చేయాలని సూచించారు.బాలానగర్ లో ఎన్‌హెచ్ 44 మీద ఉన్న అంబేద్కర్ విగ్రహం షిఫ్టింగ్ విషయంలో తగిన స్థలం లభించలేదని అధికారులు తెలిపారు. ఈ విషయం పై రెవెన్యూ అదనపు కలెక్టర్ ,బాలనగర్ తహసీల్దార్, విబీతి। అధికారులు వెంటనే సరైన స్థలాన్ని గుర్తించి విగ్రహం ని షిఫ్ట్ చేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి రాయచూర్ రోడ్ పెట్రోల్ బంక్ వరకు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా నిర్మించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత విబీ అధికారులను ఆదేశించారు.అలాగే బైపాస్ రోడ్డుపై కొత్తగా తెరిచిన డివైడర్ల వద్ద బ్యారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్ బీ అధికారులకు సూచించారు. బైపాస్ రోడ్డుకు సంబంధించి మూడు ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్ ఏర్పాటు కోసం రూ.7.5 లక్షల ప్రతిపాదనలు సమర్పించామని, 10 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. జిల్లాలోని జాతీయ రహదారులపై, పట్టణంలోని రహదారులపై, అలాగే బైపాస్ రోడ్డుపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సైన్‌బోర్డులు, బారికేడ్లు, లైటింగ్ వంటి అన్ని భద్రతా చర్యలు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా రోడ్డు భద్రతను పటిష్టం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్పి డి. జానకి, ఆర్ అండ్‌బీ ఈఈ సంధ్య, ఆర్అండ్ ఎన్బి ఈఈ రమేష్ , పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ హెచ్‌ఎఐ సైట్ ఇంజనీర్ భాను మిశ్రా, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, రోడ్డు భద్రతా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివి

మొదటి పేజీ తరువాయి భాగం..

రూ.200కోట్లతో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.వనపర్తిలో ఇప్పటికే కేంద్రీయ విద్యాలయ స్కూల్‌మంజూరు కావడం జరిగిందని,రాబోయేరోజుల్లో నవోదయ విద్యాలయాన్ని కూడా వనపర్తికి మంజూరు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక్క పూరి కూడా లేకుండా ప్రతి ఒక్కరికి పక్కాఇల్లు ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరుచేస్తుందని,తద్వారా పేదల సొంతింటి కల నెరవేరుస్తోందని తెలిపారు. వనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీ రాజ్,ఆర్అండ్‌బీపరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వనపర్తిలో రూ.70కోట్లతో అందరికీ మంచినీటి సౌకర్యం అందించేందుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. పెబ్బేరులో రూ.25కోట్లతో సీసీరోడ్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వనపర్తి పట్టణానికి తలమానికంగా ఉన్న రాజా బంగ్లాను, హాస్టల్లో రూ.22కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా శాఖ చొరవతో శ్రీనివాసపూర్ సర్వేనెంబర్ 55 లో స్పోర్ట్స్ పాఠశాల మంజూరుచేసినట్లు తెలిపారు.అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృతంగా చర్యలు చేపట్టిందని, రైతు భరోసా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన అరైవ్ అలైవ్, ఆరోగ్య వారోత్సవాలు, వ్యవసాయం, గ్రామీణభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రుణాల పంపిణీ, ఉద్యాన శాఖ కార్యక్రమాలపై అధికారులు వివరాలను తెలియజేసారు. కార్యక్రమం అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో జిల్లా పోలీసు శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా ఉద్యాన శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారు చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ముఖ్య అతిథులు సందర్శించి తిలకించారు.ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ. 313 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల రెండు సంవత్సరాల సంబంధించిన చెక్కును, స్వయం సహాయక సంఘాలకు రూ.12.32 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు చెక్కును ముఖ్య అతిథులు అందజేశారు. వనపర్తి మండల మహిళా సమాఖ్య విక్కీ పౌల్ట్రీ యూనిట్ కోసం రూ. 3 లక్షల చెక్కును, మండల మహిళా సమాఖ్యలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎన్ ఆర్ ఎల్ ఎం గ్రాంట్ కింద రూ. 5.97 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. గ్రామ సంఘాలకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ. 4.42 కోట్ల కమిషన్ చెక్కును అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర, పెబ్బేరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, సిపిఓ హరికృష్ణ, డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా స్థాయి అధికారులు, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా క్రికెట్ పోటీలు

### చర్లకోల శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహణ

### ప్రారంభించిన మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

### మొదటి బహుమతి రూ. లక్ష, రన్నర్ ప్రైజ్ రూ. 50వేలు

### పోటీల్లో నమోదు చేసుకున్న 74 జట్లు



ట్రోఫీలు అందజేస్తున్న మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, మే 2 ప్రభాతవార్త :** ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచినా ఓడినా క్రీడా స్ఫూర్తిని చాటాలని బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. సిఎల్ఆర్ ఛాంపియన్ క్రికెట్ ట్రోఫీ ప్రారంభించిన మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రమశిక్షణతో క్రికెట్ ఆడాలని ఎండాకాలం ఉన్నందున వేడి చాలా ఎక్కువగా ఉన్నందున ఉదయం సాయంత్రం చూసి ఆడాలని సూచించారు. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో కౌన్సిలర్ శశికిరణ్ , వినయ్ వారి టీం ఆధ్వర్యంలో కీ.శే. చర్లకోల శ్వేత జ్ఞాపకార్థం సిఎల్ఆర్ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ 2026 ను మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో 74 జట్లు పాల్గొననున్నాయి. ఈ యొక్క ఛాంపియన్ ట్రోఫీ మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలుగా నిర్ణయించారు. పోటీల్లో పాల్గొనే వారు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. టోర్నీ లో పాల్గొంటున్న టీమ్స్, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిఎల్ఆర్, శ్వేతా లక్ష్మారెడ్డి అభిమానులు పాల్గొన్నారు. శ్వేతా జ్ఞాపకార్థం వారి ఆత్మ శాంతి కొరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, వైస్ చైర్ పర్సన్ సారిక రామ్మోహన్, నాయకులు పిట్టల మురళి, ప్రణీల్ చందర్, నాగిరెడ్డి, శ్రీశైలం యాదవ్, పెద్ది వెంకటేష్, నవీన్ చంద్ర, శంకర్ నాయక్, ఇంతియాజ్ ఖాన్, శ్రీకాంత్, వీరేష్, కరాటే శీను, కొండల్, బికేఆర్, అంజి బాబు, సాయి, అమీర్, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్ రెడ్డి, ఉమా శంకర్ గౌడ్, ఆలూరి శశికిరణ్, బుక్క మహేష్ తదితరులు ఉన్నారు.

## జిల్లాలో దారుణ హత్య..

మొదటి పేజీ తరువాయి భాగం..

అక్రమించుకున్నారు. దీనిపై గత కొంతకాలంగా ఇరువర్గాల మధ్య భూతగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున చంద్రునాయక్ తన పొలం వద్ద ఉండగా,నిందితులు రాములునాయక్ తోపాటు మరికొందరు కలిసి పథకం ప్రకారం దాడి చేసి దారుణంగా కొట్టి చంపారు.

అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆరోపణలు:చంద్రు నాయక్ కు చెందిన భూమితో పాటు ప్రభుత్వ భూమిని రాములు నాయక్ దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని, దీనిపై బాధితుడు చంద్రునాయక్ తహసీల్దార్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చంద్రునాయక్ కు ప్రాణహాని ఉందని తెలిసినా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ హత్య జరిగిందని వారు మండిపడుతున్నారు.

ఘటన అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మృతునికి భార్యతో పాటు పిల్లలు ఉండటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## నీట్" పకడ్బందీగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

లేని ఎటువంటి వస్తువులను తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోనే పెన్నులు అందజేస్తారు అని అన్నారు.అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులను తీసుకురావాలని సూచించారు.అభ్యర్థులు నిర్ణీత డ్రెస్ కోడ్‌ను పాటిస్తూ, ఫార్మల్ దుస్తుల్లో హాజరుకావాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జెఎల్‌బి హరిప్రియా, డిఆర్ఓ రాం రెడ్డి, జిల్లా నీట్ నోడల్ అధికారి వై. సురేందర్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఆర్.అనిత



**మహబూబ్‌నగర్, మే 2, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఆర్ అనిత బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శనివారం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల బొకే అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆనందరావు, వైస్ ప్రెసిడెంట్ పి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బులు నరసింహారెడ్డి, కోశాధికారి బి.రాజు గౌడ్, పాలమూరు న్యాయవాదుల పరస్పర సహకార సంస్థ అధ్యక్షుడు రోహిణి అయ్యంగార్, ప్రధాన కార్యదర్శి బి. కాంత రెడ్డి, బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు రాఘవేందర్, వంశీ కృష్ణ, మద్వారాజ్, శ్రీశైలం పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధిలో జడ్చర్లను అగ్రగామిగా చేస్తా

### ప్రభుత్వం నుంచే కాకుండా

### ప్రైవేటు నుంచి కూడా నిధులు తీసుకొస్తా

### రాబోయే రెండేళ్లలో కంపెనీల

### నుంచి సీఎస్ఆర్ కింద రూ.70 కోట్లు సమీకరిస్తా

### ప్రభుత్వ బడులను ప్రైవేటు కంటే మిన్నగా అభివృద్ధి చేస్తా

### విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మే 2 ప్రభాతవార్త :** విద్యా రంగంలో జడ్చర్ల నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచే కాకుండా ప్రైవేటు కంపెనీల నుంచి కూడా సీఎస్ఆర్ పథకం ద్వారా తీసుకొస్తామని, రాబోయే రెండేళ్ల కాలంలోనే రూ.70 కోట్లు విద్యాభివృద్ధి కోసం సమీకరిస్తామని వెల్లడించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శనివారం జరిగిన జడ్చర్ల నియోజకవర్గ స్థాయి సమావేశంలో అనిరుధ్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగానే ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు ఎక్కువగా ఉంటాయి, అలాగే వాటి బిల్డింగులు కూడా పెద్దగా ఉంటాయని, కానీ గవర్నమెంట్ స్కూళ్లలో బిల్డింగులు చిన్నగా ఉన్నా, వాటిలో చదువులు మాత్రం బాగుంటాయని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లో పని చేసే టీచర్లు అందరూ విద్యాధికులు, శిక్షణ పొందిన వారని అందుకే వారు టీచర్లు పాఠాలు బాగా చెప్తారని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివిన వారు చాలా మంది మంచి వృద్ధిలోకి వచ్చారన్నారు. అందుకే అన్ని గ్రామాల్లోనూ స్కూళ్లను అభివృద్ధి చేసుకోవాలని, దీనికి పూర్తిగా తన సహకారం అందిస్తానని చెప్పారు. ఈ విషయంలో తాను రాజకీయ విభేదాలను పట్టించుకోబోనని తెలిపారు. రాష్ట్రంలో బాసర తర్వాత జడ్చర్ల లోనే ట్రిపుల్ ఐటీ వచ్చిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గ్రామాల్లో పదో తరగతిలో 500 కు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ ఎంట్రన్స్ రాయించి అత్యధిక సీట్లను సాధించుకోవడానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం జరుగుతున్న కృషి, పదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ఉచిత స్టడీ మెటీరియల్ కారణంగా ఉత్తీర్ణతా శాతం బాగా పెరిగిందన్నారు. పదో తరగతిలో జడ్చర్ల మండలంలో 2022,23 లో 56 మంది మాత్రమే పాస్ కాగా, ప్రస్తుతం 2024,25 లో 91 మంది పాస్ అయ్యారని, అలాగే రాజాపూర్ మండలంలో కూడా పాస్ పర్సంటేజీ 56% నుంచి 97% శాతానికి పెరగగా, నవాబుపేట మండలంలో 100% మంది టెన్త్ పాసయ్యారని అనిరుధ్ రెడ్డి ఉదహరించారు. కేవలం ఉత్తీర్ణతా శాతం పెరగడమే కాకుండా ప్రైవేట్ స్కళ్ల కంటే గవర్నమెంట్ స్కూళ్లలో చదివే పిల్లలే ఎక్కువ మార్కులు కూడా సాధించారని వివరించారు. పాఠశాలల అభివృద్ధి కోసం ప్రైవేటు సంస్థల సహకారం కూడా తీసుకుంటామని రాబోయే రెండేళ్ల కాలంలో రూ.70 కోట్లు సీఎస్ఆర్ పథకం కింద విద్యాభివృద్ధి కోసం సమీకరిస్తామని చెప్పారు. అరబిందో ఫార్మా కంపెనీ కూడా తాను అడిగిన వెంటనే సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.4 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఈ నిధులతో ఊర్కొండ మండలంలోని గుడిగానిపల్లి సహా మరికొన్ని పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా రాజాపూర్, మిడ్జిల్ మండలాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్లు పెట్టి మహిళా సంఘాలకు వాటిని ఇవ్వాలని తాను ప్రతిపాదించానని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఎస్డీఎఫ్ ఫండ్స్ రూ.5 కోట్లను 100 గ్రామాలకు ఇచ్చానని, మిగిలిన 88 గ్రామాలకు కూడా ఈ ఏడాది నిధులను ఇస్తామన్నారు. ప్రజాపాలనలో భాగంగా నియోజకవర్గంలో 12,435 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు.

కొన్ని చోట్ల ఒకేసారి ఇవ్వాల్సిన 3 నెలల సన్న బియ్యానికి బదులు ఒక నెల కోటా ఇవ్వకుండా బియ్యానికి బదులుగా డబ్బు ఇచ్చారనే ఫిర్యాదులు తనకు అందాయని, ఇలాంటి తప్పులను తాను ఉపేక్షించే ప్రసక్తే లేదని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. నియోజకవర్గంలో కొత్తగా 22 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయించామని, వాటిలో నిర్మాణం పూర్తయిన వాటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు, ఉదండాపూర్ నిర్వాసితుల కాలనీకి కొత్త సబ్ స్టేషన్ మంజూరు అయ్యిందని, నిర్వాసితులకు రావాల్సిన రూ. 200 కోట్లు పరిహారం కూడా ఈ నెలలోనే వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఉన్న చోట విద్యుత్ లైన్లు, పోల్స్ షిఫ్టింగ్ కూడా చేపడుతామని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. అలాగే అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫామ్స్, టీచర్లకు మొబైల్ ఫోన్స్‌ని పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజ్ పథకంలో భాగంగా జడ్చర్ల నియోజకవర్గం లోని మహిళా సంఘాలకు రూ.5.90 కోట్ల చెక్కులు అందజేశారు.ఈ సమావేశంలో నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.